క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు



సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కథలాపూర్: మండలంలోని బీజేపీ నాయకులు సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను వేములవాడలో కలిశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి వినతిపత్రం ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్వర్‌రావు, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా నిలుస్తాం



సాయికుమార్‌ను కలిసిన రుత్త నారాయణ

మల్లాపూర్: ఫిషరీస్ కార్పొరేషన్ ద్వారా మత్స్యకారులకు అండగా నిలిచి అన్నివిధాలుగా ఆదుకుంటామని ఫిషరీస్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని ఫిషరీస్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి కాంగ్రెస్ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ హాజరై సాయికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

ఆలయాల్లో మాజీ మంత్రి కొప్పుల పూజలు



చైర్‌పర్సన్‌ను పరామర్శిస్తున్న కొప్పుల

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్వామివార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్ర పటం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇటీవల మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మను, రోడ్డు ప్రమాదంలో కాలసాని రాజేందర్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, ఉపాధ్యక్షుడు అక్కెనపెల్లి సునిల్‌కుమార్‌సంగి శేఖర్ ఉన్నారు.

మోడల్‌స్కూల్‌కు అదనపు బస్సు నడపాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్యాల: మండలంలోని నూకపల్లి మోడల్ స్కూల్‌కు మరో బస్సు నడపాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నేరెళ్ల సతీశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు వెంకటేశ్, కంటె అరుణ్ జగిత్యాల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. మోడల్‌స్కూల్‌కు నిత్యం 120 మందికిపైగా ఒకే బస్సులో ప్రయాణం చేస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అసిస్టెంట్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించారని యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

పోసానిపేట గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు

కథలాపూర్: మండలం పోసానిపేట గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, మాజీ సర్పంచ్ ఎం జీ రెడ్డి సోమవారం తెలిపారు. పోసానిపేటలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గత నెలలో దుంపేట, పోసానిపేట గ్రామాల రైతులు విన్నవించారు. దీంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపి సబ్‌స్టేషన్ కోసం నిధులు రూ. 2.20 కోట్లు మంజూరు చేయించినట్లు వారు పేర్కొన్నారు.



మెట్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోరుట్లలో పూలమాల వేస్తున్న నాయకులు



మల్లాపూర్‌లో..



ఇబ్రహీంపట్నంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



రాయికల్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు



బీర్‌పూర్ లో..

ఘనంగా వైఎస్సార్ జయంతి

కోరుట్ల/కోరుట్ల రూరల్/ ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/పెగడపల్లి/మల్యాల/కథలాపూర్/సారంగాపూర్: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రం, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా ఆయన చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కథలాపూర్‌లో వైఎస్సార్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



మల్యాలలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వన మహోత్సవంలో భాగస్వామ్యం కావాలి



తుమ్మెనాలలో మొక్కలకు నీరు పోస్తున్న విప్

ధర్మపురి/వెల్గటూర్: మొక్కలు నాటి సంరక్షించాలని, అధికారులు బాధ్యత తీసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. 75వ వన మహోత్సవంలో భాగంగా మండలంలోని తుమ్మెనాల, బుగ్గారం మండలం మద్దునూర్‌లో, వెల్గటూర్ మండలం అంబరిపేటలో మొక్కలు నాటారు. వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మొక్కలను రక్షిస్తే అవే మనలను కాపాడుతాయని తెలిపారు. తుమ్మెనాలలో నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, కుంట సుధాకర్, సింహరాజు ప్రసాద్, ఏపీఎం రమాదేవి, ఏపీవో సృజన్ పాల్గొన్నారు. మద్దునూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అంబరిపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఏపీవో అనిల్ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కిషన్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతు భరోసా హామీ నెవేర్చకపోవటం దురదృష్టమన్నారు. సబ్ కమిటీల పేరుతో కాలయాపన చేయటం సరికాదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 200 రోజులు గడుస్తున్నా రైతులకిచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, కౌన్సిలర్ నరేష్, చెట్లపల్లి సాగర్, చిరుమల్ల ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీల పేరుతో ప్రభుత్వం రైతులను మోసగిస్తోంది

మల్లాపూర్: రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరిట కాలయాపన చేస్తూ రైతులను మోసగిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో తహసీల్దార్ వీర్‌సింగ్‌కు కిసాన్ మోర్చా అధ్యక్షుడు దేశెట్టి భూమేశ్‌తో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న రైతు భరోసా కింద రైతులకు పంట పెట్టుబడి సాయం అందడంలేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా అంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి కిరణ్, నాయకులు దేవేందర్, రాజేందర్, రాజారాం, హన్మాండ్లు, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న డీఎస్పీ

జగిత్యాల క్రైం: నంబర్ ప్లేట్ లేకు వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రఘు చందర్ అన్నారు. సోమవారం రాత్రి వాణినగర్ బసవేశ్వర్ కూడలి వద్ద పట్టణ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ రఘుచందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ముందు, వెనుక నంబర్ ప్లేట్ ఉంచుకోవాలని, అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, మద్యం తాగి వాహణాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేశ్, మన్మథరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వ్యాపారులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

జగిత్యాలక్రైం: పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్యాపారులు సహకరించాలని పట్టణ సీఐ వేణుగోపాల్ కోరారు. ట్రాఫిక్ నిబంధనలపై వర్తక సంఘం భవనంలో వ్యాపారస్తులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ దుకాణాల ఎదుట ఐరన్ బోర్డులు, ఫ్లెక్సీలు, అమ్మకానికి పెట్టి వస్తువులు రోడ్డుపై ఉంచడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. వ్యాపారస్తులు రోడ్లపై ఎలాంటి ఫ్లెక్సీలు పెట్టవద్దని, వారి దుకాణాల ఎదుట వాహనాలను సరైన పద్ధతిలో పార్కింగ్ చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్, వర్తకం సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో సోమవారం గ్రామానికి చెందిన రెడ్డవేన లింగన్న గుడుంబా అమ్ముతుండగా ఎస్సై అనిల్ పట్టుకొని 15 లీటర్ల గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భజరంగదళ్ కార్యవర్గం నియామకం

కోరుట్ల: మెట్‌పల్లి పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో భజరంగ్ దళ్ ఒక రోజు అభ్యాస్ వర్గ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రఖండ, నగర స్థాయి కార్యవర్గ నియామకం చేపట్టారు. జగిత్యాల జిల్లా కో కన్వీనర్లుగా కల్లెడ రోహిత్, మనోహరా చారి లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భజరంగదళ్ రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేష్, విభాగ్ సహ సంయోజక్ అల్లె మధు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గజం రాజు, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ ఎస్సైగా అశోక్

రాయికల్: మండల ఎస్సైగా టి. అశోక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై అజయ్ ఏసీబీ కేసులో పరారీలో ఉండగా.. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు అశోక్ బాధ్యతలు స్వీకరించారు.

సహస్ర లింగాల ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పోలాస గ్రామ శివారులోని సహస్ర వేయి లింగాల ఆలయంలో సోమవారం వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన వంగపెల్లి రేణుక అనే భక్తురాలు ఆలయంలో మోకాళ్ల ప్రదక్షణ చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

మంగళసూత్రాలు బహూకరణ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రతిరోజు జరిగే స్వామివార్ల కల్యాణానికి రెండు జతల బంగారు మంగళసూత్రాలను బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన శృతప్రీతి, సునితి, సత్యవతి, సరిత, సరళలు సోమవారం సుమారు 4 లక్షల రూ.ల విలువ చేసే మంగళసూత్రాలను దేవస్థానం ఈవో శ్రీనివాస్‌కు సమర్పించారు. దాతలకు దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివార్ల తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవమైనది



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దావ వసంత

జగిత్యాలరూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యత పెంచుతుందని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాల రూరల్ మండలం బావోజిపల్లె ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన రేఖ అనే ఉపాధ్యాయురాలిని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

రాయికల్: పట్టణ శివారులోని రామాజీపేట, మైతాపూర్ శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రామాజీపేట బ్రిడ్జి వద్ద బీజేపీ నాయకులు రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు ధర్మపురి,నాయకులు కుర్మమల్లారెడ్డి,కుంబోజిరవి,బోడుగం శ్రీకాంత్‌రెడ్డి,కోల శంకర్,అశన్న,భూమేశ్,మొత్కురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జోష్...

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస హైస్కూల్‌లో ఫ్రెషర్‌డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, రజిత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోరింటాకు వేడుక..



గోరింటాకుతో మహిళలు

కోరుట్ల: పట్టణంలోని సినారే కళాభవన్‌లో పద్మనాయక మహిళా వెల్మ సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం ప్రారంభం సందర్భంగా సోమవారం మహిళలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలంతా తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.గోరింటాకు ప్రాముఖ్యతను వివరించారు.కార్యక్రమంలో పద్మనాయక మహిళా వెల్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి నిలబడి కొట్లాడుతా

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి నిలబడి కొట్లాడుతానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి 63 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పలు చోట్ల మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాల్లో కొత్త పెడుతూ ప్రజలు, రైతులను సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలు, వాగ్దానాలతో ప్రజలను మోసగించి కాంగ్రెస్ అధికారం చేపట్టిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపెల్లి సరోజన, ఆదిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, ప్యాక్స్ చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, బద్దం అంజిరెడ్డి, నేరేళ్ల మోహన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అమూల్యమైనవి

లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలు అమూల్యమైనవని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పాతదాంరాజుపల్లిలో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రిజీయన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, నాయకులు, పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



రేషన్ షాప్ ప్రారంభిస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లిరూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం రాంచంద్రంపేటలో మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగారెడ్డితో కలిసి రేషన్ దుకాణాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడి ప్రజలకు రేషన్ దుకాణం అందుబాటులో లేక ఏళ్ల నుండి 2.కి మీల దూరంలోని వెల్లులలోని దుకాణం వద్ద రేషన్ బియ్యం తెచ్చుకునేవారన్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా ఇక్కడ రేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం నర్సింగరావు, లింగారెడ్డిని గ్రామస్థులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌రెడ్డి, తిరుపతి, అంజయ్య, రాజశేఖర్,రంజిత్,రామకృష్ణ,అనిల్,మధు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహం ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహాన్ని కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, నాయకులు భాస్కర్‌రెడ్డి, తండా వాసులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ఆదర్శ పాఠశాలలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో బాలిక రక్షణపై, మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్, అత్యవసర వేళల్లో ఏదైన సమస్యలు ఎదురైతే షీటీం నెంబర్ 8712670783 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, షీటీం ఇన్‌చార్జి వలిబేగ్,మహిళ కానిస్టేబుల్స్ సౌజన్య,పూజిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఏబీవీపీ నాయకులు

కోరుట్ల: పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 76 వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటారు. దేశం కోసం పాటుపడే ఏకైక విద్యార్థి సంస్థ ఏబీవీపీ అన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మాడవేణి సునీల్, నాయకులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ ప్రారంభం

మల్యాల: గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు బోర్‌వెల్ వేసినట్లు ప్రాజెక్టు డైరెక్టర్ సిస్టర్ పీత అన్నారు. సోమవారం మండలంలోని తక్కళ్లపల్లి ఎస్సీ కాలనీలో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బోర్‌వెల్ వేసి, సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరాటి లక్ష్మీనారాయణ, సొసైటీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ దీప్తి, వెలంగిని, సొసైటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన శివభక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి శివాలయం ఆవరణలో సోమవారం మహిళా శివ భక్తులు వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆరె సుశీల, ఆరె సువర్ణ, దొనికెన పావని, దొనికెన లావణ్య, ఆరె రాజమణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

కథలాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీవో ప్రవీణ్ అన్నారు. మండలంలోని అంబారిపేటలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం పలు వాడల్లో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. వర్షాకాలంలో డ్రెయినేజీలో చెత్త చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు సక్రమంగా వచ్చేలా అంగన్‌వాడీ టీచర్లు ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి మహేశ్ ఉన్నారు.